## క్లుప్తంగా

### గోపాలకృష్ణకు ఉగాది నంది అవార్డు



ఉగాది నంది పురస్కారం అందుకుంటున్న గాయకుడు గోపాలకృష్ణ

కోదాడ : భక్తిగీతాల ఆలాపనలో ప్రతిభ చూపుతున్న కోదాడ పట్టణానికి చెందిన భక్తిగీతాల గాయకుడు నూకపంగు గోపాలకృష్ణకు హైదరాబాద్‌కు చెందిన ఉజ్వల సాంస్కృతిక, సామాజిక స్వచ్ఛంద సంస్థ ఉగాది నంది అవార్డు ప్రకటించింది. మంగళవారం రాత్రి హైదరాబాద్‌లోని అబిడ్స్‌లో గల జయ ఇంటర్నేషనల్ హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రముఖ సాంఖ్యాక శాస్త్ర నిపుణుడు దైవజ్ఞశర్మ చేతుల మీదుగా గోపాలకృష్ణ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా గోపాల్‌ను పలువురు అభినందించారు.

### పాఠశాలను పరిశీలించి.. విద్యార్థులకు భోజనం వడ్డించి



విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న ఎంఈఓ చత్రునాయక్

గరిడేపల్లి : విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంఈఓ చత్రునాయక్ అన్నారు. బుధవారం గరిడేపల్లి మండల పరిధిలోని తాళ్లమల్కాపురం గ్రామంలో గల ప్రాథమికోన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో జరుగుతున్న పరీక్షల నిర్వహణను, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన స్వయంగా విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు భూక్య గోవిందు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

### ఏరియా ఆస్పత్రికి వీల్‌చైర్ బహూకరణ



వీల్‌చైర్ అందజేస్తున్న దాతలు

హుజూర్‌నగర్ : పట్టణంలోని ప్రభుత్వ ఏరియా హాస్పిటల్‌కు హుజూర్‌నగర్ వాసవి వనిత క్లబ్ అధ్యక్షురాలు పోలిశెట్టి ఝాన్సీరాణి వెంకటేశ్వర్లు బుధవారం వీల్‌చైర్ బహూకరించారు. హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రవీణ్‌కుమార్, డాక్టర్ రవికి వీల్ చైర్ అందజేశారు. కార్యక్రమంలో రామనరేష్, వాసవి క్లబ్ అధ్యక్షుడు కె.పాపారావు ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు (కొండలు), కోశాధికారి యు.వెంకటేశ్వర్లు, బి.శ్రీనివాసరావు, వి.సతీష్, జి.ప్రవీణ, స్వామి, గోపి, చిరంజీవి, నిత్యశ్రీ, శృతి, వరలక్ష్మి, పావని, గీత తదితరులు పాల్గొన్నారు

### మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

నడిగూడెం : మండల పరిధిలోని కాగితరామచంద్రాపురం గ్రామానికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు మొగిలి పరుశరాములు (55) గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులున్నారు. మృతుడి మృతదేహాన్ని పలువురు భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబానికి భవన నిర్మాణ కార్మిక సంఘం తరఫున రూ.8 వేలు ఆర్థికసాయం అందజేశారు. నివాళులర్పించిన వారిలో వల్లెపు శ్రీనివాస్, పల్లపు తిరుమలేష్, చిక్కుళ్ల ఉపేందర్, షేక్.మహిమూద్, ప్రసాద్, వేముల రాములు, రామకృష్ణ, తురక ఉప్పయ్య, సుభాన్‌ఖాన్, నాగరాజు, లక్ష్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### అగ్ని ప్రమాదాలు, నివారణపై అవగాహన



అగ్నిప్రమాద నివారణపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

హుజూర్‌నగర్ : అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా బుధవారం హుజూర్‌నగర్ పట్టణంలోని పలు కాలనీల్లో గల అపార్ట్‌మెంట్లలో అగ్ని ప్రమాదాలు– నివారణ చర్యలపై మహిళలకు అగ్నిమాపక కేంద్ర సిబ్బంది అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇళ్లలో సిలిండర్‌లో గ్యాస్ లీకై అగ్ని ప్రమాదానికి గురైతే ఎలా నివారించాలో వివరించారు. కార్యక్రమంలో అగ్నిమాపక కేంద్ర సిబ్బంది డి.దేశ్యా, జి.సైదులు, జె.వెంకటేశ్వర్లు, బి.శివ, ఆర్.గోపయ్య, తదితరులు పాల్గొన్నారు.

**చింతలపాలెం మండలంలో..**

చింతలపాలెం మండలంలోని జువారి సిమెంట్స్ పరిశ్రమలో అగ్ని ప్రమాదాలు– నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పరిశ్రమ హెడ్ (వర్క్స్) జీఎన్‌బీరావు, సేఫ్టీ డిప్యూటీ జనరల్ మేనేజర్ కరీముల్లా, పరిశ్రమ ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

# అకాల వర్షం.. ఆగమాగం



బూరుగడ్డలో తడిసిన ధాన్యాన్ని చూపిస్తున్న రైతు



వేపలసింగారంలో ధాన్యంపై కప్పిన పట్టాలపై నిలిచిన వర్షపు నీటిని తొలగిస్తున్న రైతు

- వర్షానికి తడిసిన ధాన్యం
- చేతికొచ్చిన పంటను కాపాడుకునేందుకు రైతన్నకు తిప్పలు
- నామమాత్రంగానే కొనుగోళ్లు

హుజూర్‌నగర్‌రూరల్ : హుజూర్‌నగర్ నియోజకవర్గ వ్యాప్తంగా మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం తెల్లవారుజాము 4 గంటల వరకు ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం తడిసింది. వర్షం పడుతుండడంతో తమ ధాన్యాన్ని తడవకుండా కాపాడుకోవడానికి చీకట్లో రైతులు అవస్థలు పడ్డారు. గాలిదుమారంలో పట్టాలు కప్పేవీలుకాక ఇబ్బందులు పడ్డారు. ఎట్టకేలకు ధాన్యంపై పట్టాలు కప్పినా ధాన్యం తడిసిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**నామమాత్రంగానే కొనుగోళ్లు..**

హుజూర్‌నగర్ మండలంలోని వేపలసింగారం, బూరుగడ్డ, అమరవరం, లింగగిరి గ్రామాల పరిధిలోని పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో 15 రోజుల క్రితం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. కానీ కొనుగోళ్లు మాత్రం నామమాత్రంగానే చేపడుతున్నారు. ధాన్యం దిగుమతి చేసుకోవడానికి మిల్లుల అలాట్మెంట్ రాలేదంటూ నిర్వాహకులు చెబుతున్నారు. దీంతో కొందరు రైతులు ధాన్యాన్ని మిర్యాలగూడ, హుజూర్‌నగర్‌లోని రైస్ మిల్లులకు తరలించి తక్కువ ధరకు అమ్ముకొని నష్టపోతున్నారు. మిల్లర్లు కూడా వాతావరణం అదును చూసుకొని సిండికేటుగా మారి ధాన్యానికి కొర్రీలు పెడుతూ కేవలం రూ. 2000, రూ. 2050 మాత్రమే ధర చెల్లిస్తున్నారని రైతులు చెబుతున్నారు. చిన్న, సన్నకారు రైతులు చేసేది ఏమి లేక దళారులు, మిల్లర్లు అడిగిన ధరకు అమ్ముకుంటున్నారు. మరికొందరు రైతులు తక్కువ ధరకు అమ్ముకోలేక ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయిస్తే గిట్టుబాటు ధరతో పాటు రూ. 500 బోనస్ వస్తుందనే ఆశతో ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించేందుకు ఆరబోశారు. కానీ గత మూడు రోజులుగా హుజూర్‌నగర్ నియోజకవర్గ వ్యాప్తంగా చిరుజల్లులతో కూడిన వర్షం కురుస్తుండడంతో ఆందోళన చెందుతున్నారు. ఉదయం ధా న్యం ఆరబెట్టడం, మబ్బు పట్టగానే రాశులు చేసుకు ంటూ ఇక్కట్లు పడుతున్నారు. వర్షాలతో చేతికొచ్చిన పంట నేలపాలు అవుతుందేమోనని పంటలు కోయని రైతులు ఆందోళన చెందుతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో కాంటాల వేగం పెంచాలని, మిల్లర్లు మద్దతు ధర చెల్లించేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

### వారం రోజులుగా ఎదురుచూస్తున్నాం



“ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం పోసి కాంటాల కోసం వారం రోజులుగా ఎదురుచూస్తున్నాం. బోనస్ వస్తుందనే ఆశతో వ్యాపారులకు అమ్ముకుండా ఇక్కడ పోశాం. కానీ గన్నీ బ్యాగులు, కూలీల కొరత సాకుతో నామమాత్రంగా కొనుగోళ్లు చేపడుతున్నారు. ఇప్పటికే ఆరిన ధాన్యం గత మూడు రోజులుగా రాత్రి సమయంలో వర్షం కురుస్తుండడంతో మళ్లీ తడుస్తోంది. ధాన్యం తడిసిన నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఆదుకోవాలి.

– గుడిసె భాస్కర్‌రెడ్డి, రైతు, వేపలసింగారం

### వర్షాలతో ఆందోళనగా ఉంది



“వర్షాలు కురుస్తుండడంతో ఆందోళనగా ఉంది. వాతావరణాన్ని అదునుగా చేసుకొని మిల్లర్లు ధాన్యానికి కొర్రీలు పెడుతున్నారు. గత మూడు రోజులు వరకు క్వింటా రూ. 2400 ఉండగా వర్షం కురవడంతో ఒక్కరోజులోనే క్వింటాకు రూ. 2100 నుంచి రూ.2 వేలు మాత్రమే చెల్లిస్తున్నారు. ఇదేంటని ప్రశ్నిస్తే ధాన్యం బాగలేవు, వద్దు అంటున్నారు. వర్షాలకు కొనుగోలు కేంద్రాల్లో అరబెట్టలేక పంటను తక్కువ ధరకు అమ్ముకోలేక సతమతం అవుతున్నాం.

– పొలగాని రాంబాబు, రైతు, మిట్టగూడెం

## సన్నబియ్యం పథకం పేదలకు వరం



సన్నబియ్యంతో సహపంక్తి భోజనం చేస్తున్న కాంగ్రెస్ మహిళా నాయకులు

నేరేడుచర్ల : కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సన్నబియ్యం పథకం పేదలకు వరం లాంటిదని కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం పట్టణ అధ్యక్షురాలు బచ్చలకూరి సుగుణ ప్రకాశ్, మున్సిపల్ మాజీ వైస్ చైర్‌పర్సన్ అలక సరిత అన్నారు. బుధవారం నేరేడుచర్ల మున్సిపాలిటీలోని 11వ వార్డులో లబ్ధిదారుడి నివాసంలో సన్నబియ్యంతో సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి నక్క రమాదేవి, కొణతం మంజుల, తాళ్ల లావణ్య, గంట ఝాన్సీ, గంగమ్మ, సూరమ్మ, శైలజ, నాగమణి తదితరులు ఉన్నారు.

**సన్నబియ్యంతో సహపంక్తి భోజనం**

గరిడేపల్లి : మండలంలోని కీతవారిగూడెం గ్రామంలో గల దళితవాడలోని నకిరేకంటి రోషమ్మ ఇంట్లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు త్రిపురం అంజన్‌రెడ్డి, పార్టీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ చాంద్‌మియా కుటుంబసభ్యులతో కలిసి సన్నబియ్యంతో సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ పెండెం శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ మూలగుండ్ల సీతారాంరెడ్డి, గుండు రామాంజీ, మాజీ ఎంపీటీసీలు బాల్తూరి సందీప్, పాకాల పరమేష్, బారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, దేవదానం, కత్తి సైదులు, కృష్ణారెడ్డి, ముత్తయ్య, మీరా, బక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

## మాయిశ్చర్ మిషన్‌లో తేడా

- ఆందోళనలో రైతులు

చిలుకూరు : మండల కేంద్రంలో సంఘ బంధం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో బుధవారం ధాన్యంలో తేమ శాతం కొలిచే యంత్రంలో తేడా కనిపించడం వెలుగుచూసింది. యంత్రంలో ధాన్యం పోయకముందు పాయింట్లు మైనస్‌లో చూపించింది. మైనస్ 2, 0.19 ఇలా ఒక్కోసారి ఒక్కో విధంగా మిషన్‌లో పాయింట్లు చూపించడంతో రైతులు ఆందోళన చెందారు. మాయిశ్చర్ మిషన్‌లో తేడా రావడంపై రైతులు నిర్వాహకులను నిలదీశారు. ఈ విషయాన్ని వ్యవసాయ శాఖ అధికారులకు తెలియజేయడంతో వారు అక్కడకు వచ్చి మాయిశ్చర్ మిషన్‌ను పరిశీలించారు. అప్పటికీ మిషన్‌లో ధాన్యం పోయకుండానే మైనస్ పాయింట్లు చూపించడంతో వెంటనే మిషన్‌ను మార్చాలని ఆ తరువాతే ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని అధికారులు నిర్వాహకులను ఆదేశించారు. అప్పటివరకు కొనుగోళ్లు చేపట్టవద్దని సూచించారు. అయితే ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి వారం రోజులు దాటినా నేటికీ ఒక్క గింజ కూడా కొనలేదని, వర్షం, గాలిదుమారంతో తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి మరో మాయిశ్చర్ మిషన్ తెప్పించి తక్షణమే కొనుగోళ్లు ప్రారంభించేలా చూడాలని రైతులు కోరుతున్నారు.



మైనస్ పాయింట్లు చూపిస్తున్న మాయిశ్చర్ మిషన్

## రైతులు సద్వినియోగం చేసుకోవాలి



అనంతగిరి : చనుపల్లిలో ధాన్యం కొనుగోలు ఉపకేంద్రాన్ని ప్రారంభిస్తున్న శ్రీనివాసరెడ్డి

అనంతగిరి : ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముస్కు శ్రీనివాసరెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని చనుపల్లి, పాలారం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు ఉప కేంద్రాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బుర్ర పుల్లారెడ్డి, కొండపల్లి వాసు, వర్కింగ్ ప్రెసిడెంట్ బాబునాయక్, డేగ కొండయ్య, ఏపీఎం లక్ష్మి, ఏఈఓ అన్వేష్‌రాజు, కార్యదర్శి రమాదేవి, వెంకటేష్, మట్టపల్లి రామకోటయ్య, కృష్ణారెడ్డి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

**కొనుగోలు కేంద్రం పరిశీలన**

చిలుకూరు : మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం వ్యవసాయ అధికారులతో కలిసి తహసీల్దార్ ధృవకుమార్ పరిశీలించారు. ఏఓ శ్రీధర్, ఆర్ఐ మంత్రిప్రగడ సీతారామచందర్‌రావు, ఏపీఎం నర్సయ్య, ఏఈఓ శిరీష, సీసీ స్వరూప, నిర్వాహకులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు

కోదాడ : ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల మౌలిక వసతులతో పాటు అర్హత గల ఉపాధ్యాయులు ఇంగ్లిష్ మీడియంలో బోధిస్తున్నట్లు కోదాడ మండల విద్యాధికారి సలీం షరీఫ్ కోరారు. బుధవారం కోదాడ బాలుర పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి పట్టణంలోని అశోక్‌నగర్, శ్రీరంగాపురం ప్రాథమిక పాఠశాలల పరిధిలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మార్కెండేయులు, శ్రీనివాసరెడ్డి, బడుగుల సైదులు, జానకిరామ్, బాలరాజు, పాండురంగాచారి, ఖాజామియా, చిన్నప్ప, రవికుమార్, ముక్తార్ ఉన్నారు.



కోదాడలో బడిబాట నిర్వహిస్తున్న ఎంఈఓ, ఉపాధ్యాయులు

### నేడు భూభారతి పోర్టల్‌పై అవగాహన సదస్సు

గరిడేపల్లి : రాష్ట్రంలో కొత్తగా అమలులోకి వచ్చిన భూభారతి పోర్టల్‌పై గురువారం గరిడేపల్లి మండల కేంద్రంలోని పైడిమర్రి రంగనాథ్ ఫంక్షన్ హాల్‌లో అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ బండ కవిత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ హాజరవనున్నట్లు పేర్కొన్నారు. రైతులు హాజరు కావాలని కోరారు.

**నేరేడుచర్లలో..**

నేరేడుచర్ల : పట్టణంలోని ఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో గురువారం మధ్యాహ్నం 2 గంటలకు భూభారతి పోర్టల్‌పై నిర్వహించబోయే అవగాహన సదస్సుకు రైతులు పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొణతం చిన వెంకట్‌రెడ్డి కోరారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ హాజరువుతున్నట్లు తెలిపారు.

### 500 చదరపు అడుగుల్లోపే ఇళ్లు నిర్మించుకోవాలి

చిలుకూరు : 400 చదరపు అడుగుల విస్తీర్ణం నుంచి 500 అడుగుల చదరపు అడుగుల్లోపే ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకోవాలని, అప్పుడే ఇళ్లకు బిల్లులు మంజూరవుతాయని కోదాడ నియోజకవర్గ హౌసింగ్ ఏఈ జేఎస్ఎన్ మూర్తి అన్నారు. బుధవారం చిలుకూరు మండల పరిషత్ కార్యాలయం పక్కన మోడల్ ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇష్టానుసారంగా ఇళ్లు నిర్మించుకుంటే బిల్లులు రావని తెలిపారు. మండలంలోని ఆర్లెగూడెంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. లబ్ధిదారులు మండల పరిషత్ కార్యాలయం వద్ద నిర్మించే నమూనా ఇందిరమ్మ ఇంటిని పరిశీలించి ఆ ప్రకారం ఇళ్లు నిర్మించుకోవాలని సూచించారు.

### ఘనంగా పవళింపు సేవ

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో గల శ్రీశాల్మలీకంద ఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాలస్వామి దేవాలయంలో బుధవారం స్వామివారి పవళింపు సేవ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం సుప్రభాత సేవ, ఆరాధన, సేవాకాలం, నిత్యహోమం, పూర్ణహుతి, బలిహరణ, తీర్థప్రసాద వితరణ గావించారు. అనంతరం ఆరగింపు, మంగళాశాసనం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గురవయ్య గౌడ్, ఈఓ లక్ష్మణరావు, యజ్ఞాచార్యులు, అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

### బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడికి సన్మానం



లక్ష్మీనారాయణరెడ్డిని సన్మానిస్తున్న మల్లికార్జున్‌రావు, తదితరులు

హుజూర్‌నగర్ : కోదాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డిని బుధవారం స్థానికంగా కాంగ్రెస్ పార్టీ హుజూర్‌నగర్ పట్టణ అధ్యక్షుడు తన్నీరు మల్లికార్జున్‌రావు సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు కుక్కడపు మహేష్‌గౌడ్, యడవల్లి వీరబాబు, కొలపూడి యోహాన్, కుక్కల వెంకన్న, సలిగంటి గణేష్ ఉన్నారు.

### వైభవంగా కోటమైసమ్మ ఆలయ వార్షికోత్సవం

కోదాడరూరల్ : పట్టణ పరిధిలోని బొడ్రాయి బజారులో కోటమైసమ్మ ఆలయ వార్షికోత్సవాన్ని నిర్వాహకులు బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అభిషేకాలు, అర్చనల అనంతరం అమ్మవారిని పూలమాలలతో అలంకరించారు. పట్టణ ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో బొడ్రాయి పునఃప్రతిష్ట కమిటీ, రైతులు, ముత్యాలమ్మ ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

కోదాడ : పట్టణ పరిధిలోని ఎంఎస్ కళాశాలలో అంబేద్కర్ ఆశయ సాధన కేంద్రం (ఆస్క్) ఆధ్వర్యంలో పాలిటెక్నిక్ ఉచిత శిక్షణ పొందుతున్న విద్యార్థులకు నిర్వాహకులు బుధవారం ఉచితంగా స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నీటిపారుదల ఇంజనీర్ సత్యానారాయణ మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బల్మూరి దుర్గయ్య, మాతంగి ప్రభాకర్‌రావు, యలమర్తి శౌరి, గంధం బుచ్చారావు, స్వామిదాసు, యాదగిరి, శ్రీప్రియ, కన్నయ్య, హరిప్రసాద్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## యువత మత్తుపదార్థాలకు బానిసకావొద్దు

- కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

భానుపురి (సూర్యాపేట) : యువతకు చాలా భవిష్యత్ ఉందని, మత్తు పదార్థాలకు బానిస కావొద్దని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. బుధవారం కలెక్టర్ ఛాంబర్‌లో నార్కోటిక్ కో ఆర్డినేషన్ సెంటర్ (ఎన్‌సీఓఆర్‌డీ-ఎన్‌కార్డు)పై ఎస్పీ నరసింహతో కలిసి ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. డ్రగ్స్‌తో కలిగే అనర్థాలపై సూర్యాపేట, కోదాడలోని కళాశాలల్లో యువతకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. అనంతరం తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూరో రూపొందిన పోస్టర్‌ను విడుదల చేశారు. సమావేశంలో యాంటీ నార్కోటిక్ డ్రగ్స్ డీఎస్పీ భిక్షపతిరావు, డీటీఓ సురేష్‌కుమార్, డీఈఓ అశోక్, డీఐఈఓ భానునాయక్, డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ సురేందర్, సూపరింటెండెంట్ శ్రీనివాసరాజు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలి

- జిల్లా వైద్యాధికారి కోటాచలం



జాతీయ క్వాలిటీ అసెస్మెంట్ నాణ్యతా ప్రమాణాలు పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి కోటాచలం

నడిగూడెం : ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ కోటాచలం కోరారు. బుధవారం నడిగూడెం మండల కేంద్రంలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో జాతీయ క్వాలిటీ అసెస్మెంట్ నాణ్యతా ప్రమాణాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆన్‌లైన్‌లో నమోదు చేసిన డేటాను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట నేషనల్ హెల్త్ మిషన్ ప్రోగ్రాం జిల్లా అధికారి ఉమ, మెడికల్ ఆఫీసర్ రాజేష్, జిల్లా నోడల్ అధికారులు డాక్టర్ మణిరత్నం, డాక్టర్ వీరేంద్రనాథ్, డాక్టర్ అఖిల, వైద్యులు వైష్ణవి, పూజ, మాధురి, గౌతమి, విక్రం, మహేశ్వరి, పీహెచ్ఎస్ కేజీయా, హెల్త్ అసిస్టెంట్ కృష్ణమూర్తి, ల్యాబ్ టెక్నీషియన్లు మహేష్, శైలజ, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## యువత ఆకర్షణలకు లోనుకావొద్దు

- అదనపు ఎస్పీ నాగేశ్వరరావు



హుజూర్‌నగర్‌రూరల్ : మాట్లాడుతున్న అదనపు ఎస్పీ నాగేశ్వరరావు

హుజూర్‌నగర్‌రూరల్ : యువత ఆకర్షణలకు లోనుకావద్దని అదనపు ఎస్పీ మేక నాగేశ్వరరావు సూచించారు. బుధవారం మండల పరిధిలోని లింగగిరిలో ఏర్పాటు చేసిన పోలీస్ ప్రజా భరోసా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అత్యాశకు పోయి గుప్త నిధుల తవ్వకాలు, మూఢ నమ్మకాలతో నరబలి, జంతు బలి లాంటి వాటికి పాల్పడి కేసులపాలు కావద్దని గ్రామస్తులకు సూచించారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. బెట్టింగ్, లోన్ యాప్‌లకు అలవాటు పడి కొందరు ఆత్మహత్యలు చేసుకోవడంతో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని అన్నారు. యువకులు, విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకొని తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావడంతో పాటు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. కార్యక్రమంలో హుజూర్‌నగర్ సీఐ చరమంద రాజు, ఎస్ఐ ముత్తయ్య, ముస్లి మైనార్టీ జిల్లా అధ్యక్షుడు నిజాముద్దీన్, నాయకులు, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

**నేర రహిత మండలంగా తీర్చిదిద్దుదాం**



అనంతగిరి : సమావేశంలో మాట్లాడుతున్న కోదాడ రూరల్ సీఐ రజితారెడ్డి

అనంతగిరి : గ్రామస్తుల సహకారంతో నేర రహిత మండలంగా తీర్చిదిద్దుదామని కోదాడ రూరల్ సీఐ రజితారెడ్డి అన్నారు. బుధవారం అనంతగిరి మండల కేంద్రంలో నిర్వహించిన పోలీస్ ప్రజా భరోసా కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. గంజాయితో అనార్థాలు, సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలపై అవగాహన ప్రజలకు కల్పించారు. గ్రామాల్లో ఎటువంటి సమస్యలు తలెత్తినా వెంటనే పోలీసులను సంప్రదించాలన్నారు. మండలంలో గంజాయికి బానిసైన యువతను గుర్తించాలని పోలీసులకు సూచించారు. అపరిచిత వ్యక్తుల పోన్ కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతి గ్రామానికి పోలీస్ అధికారులను నియమించి గ్రామాల్లో జరిగే వ్యవహారాలపై ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ నవీన్‌కుమార్, కోదాడ రూరల్ ఎస్ఐ అనిల్‌రెడ్డి, ఏఎస్ఐ లింగారెడ్డి, మాజీ సర్పంచ్ వేనేపల్లి వెంకటేశ్వరరావు, కొండపల్లి వాసు, డేగ కొండయ్య, పందిరి వీరయ్య, యరసాని కుమార్, దావీదు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## కమ్యూనిటీ హాల్ నిర్మించాలని మంత్రికి వినతి



మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో మాట్లాడుతున్న టీచర్స్ కాలనీ కమిటీ సభ్యులు

హుజూర్‌నగర్ : పట్టణంలోని టీచర్స్ కాలనీలో కమ్యూనిటీ హాల్ నిర్మించాలని ఆ కాలనీవాసులు కోరారు. ఈమేరకు బుధవారం హైదరాబాద్‌లో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. కాలనీలో దాదాపు 300 ఇళ్లు ఉన్నాయని, రామారమి రెండు వేల జనాభా ఉంటున్నారని, కాలనీలో మున్సిపల్ లేఅవుట్ స్థలాలు నాలుగు ఉన్నాయని, వాటిలోని ఒక స్థలంలో కాలనీవాసుల సౌకర్యార్థం కమ్యూనిటీ హాల్ నిర్మించాలని మంత్రిని కోరారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో కమిటీ సభ్యులు తాటి ప్రభాకర్‌రెడ్డి, ఎంఎస్ఎన్ రాజు, బెల్లంకొండ శ్రీనివాస్, ఈదుపుగంటి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## తెలుగు నాటక రంగాన్ని కాపాడుకోవాలి



సీనియర్ కళాకారులను సన్మానిస్తున్న రంగ స్థల కళాకారులు

మఠంపల్లి : తెలుగు నాటక రంగాన్ని కాపాడుకోవాలని హుజూర్‌నగర్ నియోజకవర్గ కళాకారుల సంఘం అధ్యక్షుడు భువనగిరి ప్రకాష్‌బాబు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు జయంతితో పాటు తెలుగు నాటక రంగ దినోత్సవాన్ని జ్యోతి ప్రకాష్ యువజన కళా మండలి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ కళాకారులను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా కళాకారులు సంఘం ఉపాధ్యక్షుడు బీవీ రామారావు, సీనియర్ కళాకారులు బత్తిని ధర్మయ్యగౌడ్, షేక్ సైదులు, వెంకటశివ, విజయ్, కిరణ్, రాజు, వీరస్వామి, కళాకారులు, తదితరులు పాల్గొన్నారు.

## సంక్షిప్త సమాచారం

**ధరల నియంత్రణలో ప్రభుత్వాలు విఫలం**

హుజూర్‌నగర్ : నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం శ్రీను ఆరోపించారు. బుధవారం హుజూర్‌నగర్ పట్టణంలోని సీఐటీయూ కార్యాలయం వద్ద దినసరి కూలీల గేట్ మీటింగ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. తిరపయ్య, వెంకటమ్మ, గోపమ్మ, మంగమ్మ, మంగ, చంద్రకళ పాల్గొన్నారు.

**వృద్ధాశ్రమంలో అన్నదానం**

మునగాల : మండలంలోని ముకుందాపురం గ్రామ శివారులో గల ఇందిర అనాథ వృద్ధాశ్రమంలో బుధవారం చిలుకూరు మండలం కట్టకొమ్ముగూడెం (రామాపురం) గ్రామానికి చెందిన వేమూరి శ్రీనివాసరావు –రాణి దంపతుల కుమారుడు యశ్వంత్ చౌదరి ప్రథమ వర్ధంతి సందర్భంగా అన్నదానం చేశారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త వేమూరి సత్యనారాయణ, ఆశ్రమ వ్యవస్థాపకురాలు నాగిరెడ్డి విజయమ్మ, జ్యోతి పాల్గొన్నారు.

**నేటి నుంచి గాలికుంటు నివారణ టీకాలు**

నడిగూడెం : మండల వ్యాప్తంగా గురువారం నుంచి వచ్చే నెల 14వ తేదీ వరకు మూగ జీవాలకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసే కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల పశు వైద్యాధికారి డాక్టర్ బి.అఖిల బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

**గోశాలకు పశుగ్రాసం అందజేత**

కోదాడ : కోదాడలోని గుంటిరఘునాథస్వామి దేవాలయానికి చెందిన గోశాలకు కోదాడ వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం గడ్డి అందజేశారు. వాసవీ క్లబ్ పట్టణ అధ్యక్షుడు శేకు శ్రీనివాసరావు, పత్తి నరేందర్, వెంపటి నరసింహారావు, శశికుమారి, గోళ్ల నాగేశ్వరరావు, రేపాల వెంకట బ్రహ్మాజీ, వెంపటి ప్రసాద్, భరత్, మాధవి, శ్రీనివాసరావు, సతీష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

**ఎస్సీ కాలనీలో సీసీ రోడ్లు నిర్మించాలి**

మునగాల : మండంలోని నేలమర్రి గ్రామపంచాయతీ పరిధిలో గల ఎస్సీ కాలనీలో సీసీరోడ్లు నిర్మించాలని డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు బచ్చలకూరి సురేందర్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. మట్టి రోడ్లపై గుంతలతో రాకపోకలకు కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కోదాడ నియోజకవర్గంలో ఎమ్మెల్యే పద్మావతి గెలుపుకోసం కాలనీవాసులు కీలకపాత్ర పోషించారని కానీ ఇప్పటివరకు ఆ కాలనీలో సీసీరోడ్ల నిర్మాణాలు చేపట్టకపోవడం శోచనీయమన్నారు.

**మాట నిలబెట్టుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం**

మునగాల : కాంగ్రెస్ ప్రభుత్వం మాదిగలకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నదని యూత్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తక్కెళ్లపాటి సాయి అన్నారు. బుధవారం మునగాల మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అంబేద్కర్ జయంతి రోజున ఎస్సీ వర్గీకరణ అమలుకు రాష్ట్రంలో నిర్ణయం తీసుకోవడం శుభపరిణామమని ఆయన పేర్కొన్నారు.